సాక్షి
వికారాబాద్
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



ఓవర్ టు ఢిల్లీ

తాండూరు అసెంబ్లీ స్థానంపై హస్తం పార్టీలో సస్పెన్స్ వీడటంలేదు. ఈ స్థానానికి చాలా మంది పోటీపడుతున్నారు. 8లో▸



రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత

గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. 8లో▸



విజృంభిస్తున్న విషజ్వరాలు

గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజాలు రోగాల బారిన పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

కలుపు నివారణతో పంటలకు మేలు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



వ్యవసాయ క్షేత్రంలో పత్తి పంటను పరిశీలిస్తున్న గోపాల్ తదితరులు

వికారాబాద్ అర్బన్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పొలాల్లో కలుపు నివారించి నేలలో తేమ ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ రైతులకు సూచించారు. సోమవారం ఆయన పలు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2,61,966 ఎకరాల్లో పత్తి, 1,30,835 ఎకరాల్లో వరి, 1,09,070 ఎకరాల్లో కంది, 38,261 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పత్తి పంట పూత నుంచి కాయ దశలో ఉందన్నారు. ప్రస్తుతం మొక్కకు నత్రజని అవసరం ఉండదని, యూరియా వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ఈ దశలో పది కిలోల యూనిట్ ఆఫ్ పొటాష్ వేయడం వల్ల కాయలు బాగా వృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ దశలో రైతులు పత్తి మొక్కజొన్న పంటకు యూరియా వేసి డబ్బులు వృథా చేసుకోరాదని ఆయన సూచించారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు: పట్టణంలో మోడల్ రోడ్డు నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఇందిరాచౌక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు గల ఇళ్ల యజమానులతో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రోడ్డు మధ్య నుంచి ఇరు వైపులా 40 అడుగల మేర విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంటుందని, ఇందుకు ఇళ్ల యజమానులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయండి

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



సమీక్షలో మాట్లాడుతున్న రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: వివిధ శాఖల ఆధ్వర్యంలో సాగుతున్న అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయా శాఖల అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన పనులను మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ కృష్ణన్, షెడ్యూల్ కులాల అధికారి మల్లేశం, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు లలిత కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: గణేశ్ నిమజ్జన ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. తాండూరులో శోభాయాత్ర ప్రశాంతంగా జరిగిందన్నారు. అన్ని చోట్ల ఇదే తరహాలో నిమజ్జనం పూర్తి చేసుకోవాలని సూచించారు. మండప నిర్వాహకులు పోలీసు అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. డీజేలు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్

పరిగి: మురుగు కాలువలు, నాలాలను ధ్వంసం చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ హెచ్చరించారు. పరిగి 15వ వార్డులో ఓ వ్యక్తి మురుగు కాలువ, నాలాను ధ్వంసం చేసి ఇల్లు నిర్మిస్తుండడంతో కాలనీ వాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం అధికారులు ఆ ఇంటిని పరిశీలించారు. ధ్వంసం చేసిన నాలాను పునర్నిర్మించాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పర్యాటకులు లేక బోసిపోయిన కోట్‌పల్లి ప్రాజెక్టు

పర్యాటకానికి పాతర!

కొంత మంది బడా నేతలు వారి ఆర్థిక ప్రయోజనాల కోసం గత సంఘటనలు, ప్రమాదాలను బూచిగా చూపి పర్యాటక రంగ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సైతం నేతల ఒత్తిడికి తలొగ్గారు. దీంతో తొమ్మిది నెలల క్రితం వరకు పర్యాటకులతో కళకళలాడిన కోట్‌పల్లి ప్రాజెక్టు నేడు బోసిపోయి కనిపిస్తోంది.

'కోట్‌పల్లి'కి పర్యాటకులు రాకుండా నేతల పన్నాగం ?

- ప్రాజెక్టు వద్ద ఎకో టూరిజం రూరల్ పార్క్ ఏర్పాటుకు రూ. 1.5 కోట్లు
- నాయకుల ఒత్తిడితో ఆగిన టెండర్లు
- మూతపడిన కాయకింగ్ బోటింగ్
- ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారులు
- పర్యాటకులను అడ్డుకోవద్దని స్థానిక ప్రజాప్రతినిధులు సూచన

ధారూరు: జిల్లాలో ప్రకృతి అందాలు చూడాలన్నా, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అనుభూతి చెందాలన్నా, ఆకట్టుకునే దృశ్యాలను వీక్షించాలన్నా ఠక్కున గుర్తుకొచ్చేది కోట్‌పల్లి ప్రాజెక్టే.. ఓ వైపు పచ్చటి పొలాలు, మూడు వైపులా అటవీ ప్రాంతం .. మధ్యలో కోట్‌పల్లి ప్రాజెక్టు. ఈ సుందర ప్రదేశాన్ని చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీకెండ్స్‌లో అయితే రద్దీ ఎక్కువగానే ఉంటుంది. కోట్‌పల్లి ప్రాజెక్టు సందర్శన ఇప్పటిది కాదు 1967 నుంచే పర్యాటకులు ఇక్కడికి వచ్చేవారు. ఉదయం వస్తే సాయంత్రం వరకు ఇక్కడే సేద తీరేవారు. వనభోజనాలు చేసి వెళ్లేవారు. 2015లో ప్రొగ్రెసివ్ తెలంగాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టులో కాయకింగ్ బోటింగ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పర్యాటకుల సంఖ్య బాగా పెరిగింది. ఇక్కడికి వచ్చిన వారంతా ప్రాజెక్టు ఒడ్డున సేదతీరడం, నీటిలో



గతంలో పర్యాటకుల సందడి

ఆడుకోవడం, ఈత కొట్టడం చేసేవారు. ప్రజాప్రతినిధులు, మంత్రులు, జిల్లాస్థాయి అధికారులు, జడ్జీలు ఇక్కడికి వచ్చేవారు.

ఆ ఒక్క సంఘటనతో..

ఎప్పుడూ పర్యాటకులతో కళకళలాడే కోట్‌పల్లి ప్రాజెక్టు ఒక్క సంఘటనతో బోసిపోయింది. 2023 జనవరిలో పూడూరు మండలం మన్నెగుడ గ్రామానికి చెందిన ఇద్దరు నీటిలో మునిగిపోయారు. వారిని కాపాడే క్రమంలో మరో ఇద్దరు నీట మునిగి నలుగురు చనిపోయారు. ఇదే సాకుగా చూసి రాష్ట్రానికి చెందిన ఇద్దరు బడా ప్రతినిధులు పావులు కదిపారు. జిల్లా అధికారులను బాధ్యులను చేస్తూ కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఎవరూ వెళ్లకుండా నిషేధించారు.

మూతపడిన కాయకింగ్ బోటింగ్

ప్రాజెక్టులో నలుగురు మృత్యువాత పడడంతో కాయకింగ్ బోటింగ్ పూర్తిగా మూతబడింది. బోటింగ్ సంస్థలో వందలాది మంది చిరు వ్యాపారులు పని చేసే వారు. ప్రస్తుతం వారు ఉపాధిలేక అవస్థలు పడుతున్నారు. ప్రాజెక్టుకు పర్యాటకులు వచ్చేలా చూడాలని చిరువ్యాపారులు పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. వికారాబాద్ మండలం సర్పన్‌పల్లి ప్రాజెక్టు సమీపంలో వెలిసిన రిసార్ట్‌ల ఓనర్లు బడా నేతలతో కుమ్మక్కై వారికి ప్రతి నెలా పెద్ద మొత్తంలో డబ్బు ఇచ్చి కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకు రాకుండా చేసేరనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలా చేయడం ద్వారా సర్పన్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకులు వస్తారని, తద్వారా ఆదాయం పొందవచ్చనేది వారి ఆలోచన.

మూలుగుతున్న నిధులు

కోట్‌పల్లి ప్రాజెక్టును ఆధునీకరించేందుకు(ఎకో టూరిజం రూరల్ పార్క్ ఏర్పాటు) ప్రభుత్వం రూ. 1.5కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రాజెక్టు మార్గంలో ఆర్చ్ ఏర్పాటు చేయడం, చైన్ లింక్ ఫెన్సింగ్, పాత్‌వేస్, మరుగుదొడ్లు, అటవీ ప్రాంతంలో సులువుగా సంచరించడానికి ట్రాక్స్ వేయడం తదితర పనులు చేపట్టాలి. ఈ పనులు మార్చి 2024 నాటికి పూర్తి కావాలి. అయితే ప్రజా ప్రతినిధుల జోక్యంతో టెండర్ ప్రక్రియ ఆగిపోయినట్లు సమాచారం. ఈ పనులన్నీ పూర్తయితే పర్యాటకులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుంది. టెండర్ ప్రక్రియ ఆగిపోవడంతో నిధులు వెనక్కి వెళ్లే అవకాశం లేకపోలేదు. అనంతగిరి, కోట్‌పల్లి ప్రాజెక్టులను టూరిజం హబ్‌గా మారుస్తామన్న మంత్రుల మాటలు నీటి మూటలవుతున్నాయని పర్యాటకులు ఆరోపిస్తున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకులు రావడం ద్వారా ఆదాయం కూడా సమకూరేది. ఈ ప్రాజెక్టుకు వాహనాల్లోనే ప్రజలు వస్తుంటారు. వాహనాల నుంచి ఫీజు వసూలు చేస్తారు. ఏటా ఈ మొత్తం రూ. 16లక్షల వరకు ఉంటుందని తెలిసింది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే ఏటా రూ. 50 లక్షల ఆదాయం సమకూరే అవకాశం లేకపోలేదు.

రక్షణ చర్యలు చేపట్టాలి

కోట్‌పల్లి ప్రాజెక్టు నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. వారి రాకతో చాలా మంది పేదలకు ఉపాధి లభిస్తుంది. పాపికొండల్లో పడవ మునిగి ఎందరో చనిపోయారు. రక్షణ చర్యలు తీసుకున్నారే తప్ప పర్యాటకుల రాకను అడ్డుకోలేదు. కొందరి నేతల ప్రయోజనాల కోసం కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకులు రాకుండా చేయడం దారుణం. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రాజెక్టు వద్ద రక్షణ చర్యలు చేపట్టి, పర్యాటకులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– స్థానిక ప్రజాప్రతినిధులు

పోడు భూముల్లో 'గిరి వికాసం'

- కలెక్టర్ నారాయణరెడ్డి
- బోరుబావుల తవ్వకానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని పోడు భూముల్లో గిరి వికాసం పథకం కింద బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 10 మండలాల్లో 436 మందికి పోడు భూముల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, వారి పొలాల్లో గిరి వికాసం పథకం కింద బోర్లు వేయనున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ, విద్యుత్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోరు బావుల ఏర్పాటుకు ఏ మేరకు నిధులు అవసరం అవుతాయో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి అటవీ శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన నివేదికలను వెంటనే అందజేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ పథకం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు అందజేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. 168 మంది వివిధ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చారు. ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సీఎం కేసీఆర్ మాట నిలుపుకోవాలి

- అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన పోస్టులను భర్తీ చేయాల్సిందే
- డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్
- వికారాబాద్‌లో ధర్నా

అనంతగిరి: అసెంబ్లీ వేదికగా సీఎం కేసీఆర్ ప్రకటించిన 13,500 డీఎస్సీ పోస్టులను భర్తీ చేయాల్సిందేనని అభ్యర్థులు డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ వేయాలంటూ సోమవారం వికారాబాద్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ 13,500 డీఎస్సీ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారని, ఆ మాట నిలుపుకోవాలని కోరారు. ఏడు సంవత్సరాల నుంచి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. 13,500గాను 5వేల పోస్టులు వేయడం దారుణమన్నారు. ప్రభుత్వ ప్రకటన తమను ఎంతగానో నిరాశ పరిచిందన్నారు. మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీనే కావాలంటూ నినాదాలు చేశారు. నామమాత్రపు పోస్టుల భర్తీతో తమ జీవితాలతో చెలగాటం ఆడరాదని హితవు పలికారు. కొన్ని కులాల వారీగా చూస్తే పోస్టులే లేవన్నారు. ఓపెన్ కేటగిరిలో సింగిల్ డిజిట్‌లో పోస్టులు ఉండడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. డీఎస్సీకి కేవలం రెండు నెలలు మాత్రమే సమయం ఇచ్చి సిలబస్ పెంచడం సరికాదన్నారు. ప్రభుత్వం డీఎస్సీపై మరో ప్రకటన విడుదల చేయాలని, లేకుంటే ఉద్యమం తప్పదని వారు హెచ్చరించారు.



వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు



తిమ్మాపూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

సంక్షేమమే మా నినాదం

- మంత్రి సబితారెడ్డి

కందుకూరు: సంక్షేమం, అభివృద్ధి తమ నినాదం, విధానమని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సరస్వతిగూడ, అగర్‌మియాగూడ, లేమూరు, తిమ్మాపూర్, జబ్బార్‌గూడ, మాదాపూర్, కొలన్‌గూడ, గుమ్మడవెల్లి, రాచులూరు, బైరాగిగూడల్లో రూ.12.55 కోట్ల నిధులతో చేపట్టిన 64 అభివృద్ధి పనులకు సోమవారం జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులాగా ముందుకెళ్తున్నామన్నారు. తొమ్మిదేళ్లకు ముందు ప్రస్తుతం ఈ ప్రాంతం ఎలా ఉందో పరిశీలిస్తే ఎంత మేర అభివృద్ధి జరిగిందో తెలుస్తుందన్నారు. పల్లె ప్రగతి, స్వచ్ఛత తదితర అంశాల్లో తెలంగాణకు జాతీయ స్థాయిలో అవార్డులు రావడమే అందుకు నిదర్శనమన్నారు. అక్టోబర్ 1న మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మెట్రో రైలు కందుకూరుకు రానుందన్నారు. తాము చేసే అభివృద్ధిని చూసి ప్రజలు తమ పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలన ఓ స్వర్ణయుగంలాంటిదని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచులు రాము, భూపాల్‌రెడ్డి, పరంజ్యోతి, గోపాల్‌రెడ్డి, సుగుణమ్మ, మంద సాయిలు, గీతేశ్వరి, ప్రభాకర్, శ్రీనివాస్‌చారి, వాసవీరేఖ, ఎంపీటీసీలు యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి, రేఖ, రాములు, ఇందిర, బాల్‌రాజు, మాజీ ఎంపీపీ శోభఈశ్వర్ పాల్గొన్నారు.

మీనమేషాలు

- చేప పిల్లల పంపిణీలో అలసత్వం
- వానాకాలం ముగుస్తున్నా 40శాతంలోపే పంపిణీ
- అవీ నాసిరకం చేప విత్తనాలే
- జిల్లాలోని చెరువులు 1,179
- చేపలు వదిలేందుకు 847 చెరువుల గుర్తింపు
- వదలాల్సిన చేప పిల్లలు 1.30 కోట్లు
- ఇప్పటి వరకు పంపిణీ చేసింది 45 లక్షలే..

వికారాబాద్: నీలి విప్లవంలో భాగంగా మత్స్య సంపదను పెంచి తద్వారా మత్స్య సహకార సంఘాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపల పెంపకానికి శ్రీకారం చుట్టింది. అయితే మత్స్య శాఖ అధికారుల అలసత్వంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. వర్షాకాలం ముగుస్తున్నా ఇంకా ఉచిత చేప పిల్లల పంపిణీలో 40శాతం లక్ష్యాన్ని కూడా చేరుకోలేదు. ఈ సారి జూలై మాసంలోనే చెరువులన్నీ నిండుకుండల్లా మారినా నేటికి వాటిలో చేప పిల్లలను వదిలే ప్రక్రియ పూర్తి కాలేదు. ఇప్పటి వరకు వదిలిన చేప పిల్లలు సైతం నాణ్యత లేనివని మత్స్య సహకార సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. అధికారులు పంపిణీ దారులతో కుమ్మక్కు కావడంతోనే నాణ్యత గురించి పట్టించుకోవడంలేదని వారు ఆరోపిస్తున్నారు. దీంతో మత్స్య సహకార సంఘాల సభ్యులు ఆంధ్రా ప్రాంతానికి వెళ్లి చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో వదులుతున్నారు.

లక్ష్యానికి ఆమడ దూరంలో..

చెరువుల్లో చేప పిల్లలు వదిలే విషయంలో అధికారులు ఎంచుకున్న లక్ష్యానికి ప్రస్తుతం చేరుకున్న దానికి ఏ మాత్రం పొంతన లేకుండా పోయింది. మరో పదిహేను రోజుల్లో వర్షాకాలం ముగుస్తుండగా ఇప్పటి వరకు సగం లక్ష్యాన్ని కూడా చేరుకోలేదు. జిల్లాలో మొత్తం 1,179 చెరువులు ఉండగా ఇందులో 847 చెరువుల్లో 1.30 కోట్ల చేప పిల్లలను వదలాలని లక్ష్యం పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 45 లక్షల మాత్రమే వదిలారు. ప్రతి ఏటా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో చెరువులు పూర్తి స్థాయిలో నిండేవి. ఈ ఏడాది జూలై మాసంలోనే నిండుకుండల్లా మారాయి. సకాలంలో చేప పిల్లల పంపిణీ జరగకపోవడంతో చాలా మంది మత్స్యకారులు ఆంధ్రా ప్రాంతానికి వెళ్లి చేప పిల్లలను తెచ్చుకుంటున్నారు. దీంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది.

నాసిరకం విత్తనమే

ప్రభుత్వం వందశాతం రాయితీపై చెరువుల్లో వదులుతున్న చేప పిల్లల్లో ఎక్కువ శాతం నాసిరకంగా ఉంటున్నాయి. సాధారణంగా మూడు నుంచి నాలుగు ఇంచుల చేప పిల్లలనే చెరువుల్లో వదిలాలి. కానీ ఒక్క ఇంచు ఉన్న చేప పిల్లలను చెరువుల్లో వదులుతున్నారు. ఇటీవల దోమ మండలం మోత్కూర్ చెరువులో అధికారులు చేప పిల్లలను వదిలేందుకు వచ్చారు. అవి ఒక్క ఇంచు మాత్రమే ఉండడంతో మత్స్యకారులు అధికారులతో గొడవ పడ్డారు. వాటిని వెనక్కు తీసుకెళ్లి నాణ్యమైన చేప పిల్లలు తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు నాలుగు సార్లు చేప పిల్లలను వెనక్కు పంపారు. నాసిరకం పిల్లలను చెరువులో వదిలితే వాటి ఎదుగుదల అనుకున్న స్థాయిలో ఉండదని మత్స్యకారులు అంటున్నారు. లక్ష పిల్లల వదిలితే అందులో 50 వేలు కూడా బతకడం లేదని వారు పేర్కొన్నారు. అధికారులు నాణ్యమైన చేప విత్తనాన్నే పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.



కొడంగల్ రూరల్: మత్స్యకారులు తిరస్కరించిన చేప విత్తనం

ఈ చేప పిల్లలు మాకొద్దు

కొడంగల్ రూరల్: నాణ్యత లేని చేప విత్తనం మాకొద్దని మండలంలోని పలు గ్రామాల మత్స్యకారులు తేల్చి చెప్పారు. సోమవారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు అధికారులు వచ్చారు. అయితే చేప విత్తనం చిన్నగా ఉండడంతో వాటిని మత్స్యకారులు తిప్పి పంపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అధికారులు తెచ్చిన చేప పిల్లలు చాలా చిన్నగా ఉన్నాయని, వాటిని చెరువుల్లో వదిలితే పెద్ద చేపలు తినేస్తాయని తెలిపారు. అంతేకాకుండా నాసిరకం విత్తనం వల్ల పిల్లలు పెరిగే అవకాశం ఉండదన్నారు. ఈ విషయమై మత్స్య శాఖ అధికారులు స్పందిస్తూ త్వరలో పెద్ద చేప పిల్లలు తెచ్చి చెరువుల్లో వదులుతామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ శ్రీలత



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ శ్రీలత

తాండూరు టౌన్: తాండూరు పట్టణం శివాజీ చౌక్‌లో అక్రమంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను అడ్డుకోవాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, బీజేపీ కౌన్సిలర్ సాహు శ్రీలత సోమవారం కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. శివాజీ చౌక్ నుంచి మల్‌రెడ్డిపల్లి వరకు నిబంధనల ప్రకారం 60 ఫీట్ల వెడల్పు గల రోడ్డు ఉండాలన్నారు. అయితే శివాజీ చౌక్‌లో ఎండీ. తౌసీఫ్ అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాడని.. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే తాండూరులో ఇళ్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందేలా చూడాలని కోరారు.

కేసీఆర్ పాలనలో కులవృత్తులకు న్యాయం

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



బొంరాస్‌పేట చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని కులవృత్తులకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం బొంరాస్‌పేట శివారులోని చెరువులో ఎమ్మెల్యే అధికారులతో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిలో రాష్ట్రం దూసుకెళుతోందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ సుచరిత, ఎంపీపీ హేమీబాయి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శేరి నారాయణరెడ్డి, దేశ్యానాయక్ పాల్గొన్నారు.

బీఎస్పీ జాతీయ ఉత్తమ సర్పంచ్‌గా సావిత్రమ్మ



ఆహ్వానపత్రం అందజేస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని చిన్న నందిగామ సర్పంచ్ సావిత్రమ్మ బీఎస్పీ జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు(2023)కు ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఎస్పీ జాతీయ కార్యాలయంలో అవార్డు జాతీయ సెలక్షన్ కమిటీ చైర్మన్, బీఎస్పీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డుకు సంబంధించి సర్పంచ్ సావిత్రమ్మ ఆహ్వాన పత్రికను అందుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో ప్రతీఏటా బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 15న ఢిల్లీలో నిర్వహించనున్న ఆల్ ఇండియా బహుజన రైటర్స్ 4వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును అందజేయనున్నట్లు బీఎస్పీ కార్యవర్గ సభ్యులు తెలిపారు. బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ టు ఢిల్లీ

హస్తినకు చేరిన తాండూరు టికెట్ పంచాయితీ

- కేఎల్ఆర్‌కు మద్దతు తెలిపిన మెజార్టీ నేతలు
- రేవంత్ సూచనతో తెరపైకి రఘువీరారెడ్డి పేరు
- టికెట్ కేటాయింపుపై కొనసాగుతున్న ఉత్కంఠ



కేఎల్ఆర్, మాజీ ఎమ్మెల్యే



రఘువీరారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి

తాండూరు: తాండూరు అసెంబ్లీ స్థానంపై హస్తం పార్టీలో సస్పెన్స్ వీడటంలేదు. నిన్నమొన్నటి వరకు ఈ స్థానం కోసం డజను మంది నేతలు పోటీ పడిన విషయం తెలిసిందే. అయితే ఆ పార్టీ రాష్ట్ర అధిష్టానం మాత్రం మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్)కి టికెట్ కేటాయించేందుకు మొగ్గు చూపింది. అభ్యర్థుల జాబితాలో కేఎల్ఆర్ పేరు మాత్రమే స్క్రీనింగ్ కమిటీ పరిశీలించింది. అయితే చివరి నిమిషంలో ఆ పార్టీ పీసీసీ చీఫ్ రేవంత్ ఒత్తిడితో ధారూరు మండలానికి చెందిన రఘువీరారెడ్డి పేరు జాబితాలో చేరింది. దీనికి తోడు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో ఇద్దరు ముఖ్య నేతలు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పాటు.. వారు కూడా తాండూరు టికెట్ కోసం పైరవీలు చేస్తుండటంతో టికెట్ పంచాయితీ మళ్లీ మొదటికి వచ్చినట్లయ్యింది.

రెండు వర్గాలుగా నేతలు..!

నిన్నమొన్నటి వరకు అసెంబ్లీ స్థానం బీసీ సామాజికవర్గానికి చెందిన నేతలకే దక్కుతుందని అంతా భావించారు. అయితే ప్రత్యర్థిని ఓడించాలంటే వారు ఏ సామజిక వర్గానికి చెందిన నేతకు టికెట్ ఇస్తారో అదే సామాజిక వర్గానికి చెందిన నేతనే తమ పార్టీ అభ్యర్థిగా బరిలో దింపాలని అధిష్టానం భావిస్తోంది. దీంతో ఏఐసీసీ సభ్యులు రమేష్ మహరాజ్ రేసులో నుంచి తప్పుకున్నారు. టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలకు చీలిపోయిందని నేతల మధ్య టాక్ నడుస్తోంది. దీనికి బలం చేకూరుస్తూ.. తాండూరు టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌కు ఇవ్వాలని భట్టి వర్గం పట్టుబడుతుండగా.. చివరి నిమిషంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తన అనుచరుడైన ధారూరు మండలానికి చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి పేరు ను జాబితాలో చేర్చారని సమాచారం. ఇటీవల తాండూరుకు చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భర్త డాక్టర్ సంపత్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు.



వీరు కూడా తమకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్..

ఈ పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ అభ్యర్థుల జాబితా ఢిల్లీ నేతల వద్దకు వెళ్లింది. దీంతో రేసులో ఉన్న నేతలు ఢిల్లీకి మకాం మార్చారు. తాండూరు స్థానం ఆశిస్తున్న కేఎల్ఆర్‌తో పాటు రఘువీరారెడ్డి తమ అనుకూల వర్గంతో కలిసి ఇప్పటికే హస్తినలో లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. తాండూరు సీటు విషయంలో రేవంత్‌రెడ్డి వర్గం పైచేయి సాధిస్తుందా.. లేక భట్టి విక్రమార్క వర్గం పైచేయి సాధిస్తుందా అనేది పార్టీ వర్గాల్లో ఇప్పుడు చర్చనీయాంశమైంది.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మర్పల్లి: గ్రామాల్లోని అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండల పరిధిలోని బూచన్‌పల్లి బస్టాండ్ సమీపంలో సీసీ రోడ్డు వేసేందుకు ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు విడుదల చేశారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో సోమవారం నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని బీఆర్ఎస్ నేతలకు ఆయన అందజేశారు. బూచన్‌పల్లి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూర్ చేసిన ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ మధుకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచన్న, వీర్లపల్లి సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మర్పల్లి సహకార సంఘం డైరక్టర్ యాదయ్య తదితరులు ఉన్నారు.

పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్

మోమిన్‌పేట: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దుర్గంచెరువు, ఇజ్రాచిట్టంపల్లి, మోమిన్‌పేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే ఆనంద్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు పొందలేనివారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పార్టీలకతీతంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హరిశంకర్, సర్పంచ్‌లు కాశీరాం, లలిత, మాజీ సర్పంచ్ వెంకటేశం, మైబల్లి, రవి తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్ నేతలకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ఎలాంటి ట్యాంపరింగ్ చేయలేదు

నాపై ఆరోపణలు అవాస్తవం

- హిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్

పూడూరు: తనను ప్రిన్సిపాల్ పదవి నుంచి తప్పించేందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని హిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్నెగూడలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా హిట్స్ కళాశాలలో తాను పనిచేస్తున్నానని.. యాజమాన్యం సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంపై ప్రశ్నిస్తే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. యాజమాన్యం ఆదేశాల మేరకే విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులకు సంబంధించి రసీదులను తెల్లకాగితాలపైనే ఇస్తున్నామని అన్నారు. బ్యాంకు ఖాతాను ట్యాంపరింగ్ చేశారన్నది పూర్తిగా అవాస్తవం అన్నారు. 2020–2022కు సంబంధించి రూ.11లక్షల ఫీజులు వసూలు అయ్యాయని.. కాలేజీ మెయింటెనెన్స్ పోను మిగతా డబ్బులను బ్యాంకు ఖాతాలో జమచేసిన రసీదులు తమవద్ద ఉన్నాయని తెలిపారు. ఫీజులను దుర్వినియోగం చేస్తే తాను ఎందుకు అందుబాటులో ఉంటానని.. తనను బద్నాం చేస్తున్నారని ఆరోపించారు. తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని తనపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. యాజమాన్యంపై ఎస్‌సీటీఈలో ఫిర్యాదు చేస్తానని అన్నారు.

'సీనియర్ సిటిజన్స్' అధ్యక్షుడిగా శివకుమార్

తాండూరు టౌన్: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ తాండూరు అధ్యక్షుడిగా ఆకారపు శివకుమార్ ఏకగ్రీవంగా నియామకమయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ నియమితులయ్యారు. సోమవారం తాండూరు పెన్షనర్స్ కార్యాలయంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా మధుసూదన్, సంయుక్త కార్యదర్శిగా మల్లేశం, కోశాధికారిగా బస్వరాజ్, కార్యవర్గ సభ్యులుగా నర్సింహులు, రఘువీర్ సింగ్, ఉదయశంకర్ పటేల్, జ్ఞానేశ్వర్, బస్వరాజ్, నారాయణరెడ్డిని నియమించారు. నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. సర్వసభ్య సమావేశంలో సీనియర్ సిటిజన్స్ యాక్టులపై



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల గూర్చి సభ్యులకు అవగాహన కల్పించారు. వయోజనులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్ ప్రభు, జూకారెడ్డి, మాజీ అధ్యక్షులు వీరేశం, సభ్యులు పద్మనాభం, బస్వరాజ్, ఈశ్వరప్ప, గోపాల్‌రెడ్డి, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ వద్ద కేవైసీ కష్టాలు



తాండూరు పోస్టాఫీస్ వద్ద ఆధార్ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన ప్రజలు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని పోస్టాఫీసు వద్ద సోమవారం కేవైసీ చేయించుకునేందుకు వెళ్లిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రేషన్ బియ్యం పొందేందుకు ఆధార్ కేవైసీని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో సోమవారం ఆధార్ కేవైసీ అప్‌డేట్ కోసం పోస్టాఫీస్ వద్ద జనాలు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో చేసేది లేక సిబ్బంది ఆధార్ సెంటర్‌ను మూసివేశారు. ఉదయం నుంచి గంటల తరబడి నిలబడితే సెంటర్ మూసేయడంపై ప్రజలు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సంతోష్ ప్రజలకు మద్దతుగా ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ప్రతిరోజు పరిమిత సంఖ్యలో మాత్రమే టోకెన్లు ఇచ్చి ఆధార్ అప్‌డేట్ తదితర సేవలు అందిస్తున్నామని ఆధార్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. అందరూ ఒక్కసారిగా ఎగబడితే మేము మాత్రం ఏంచేయగలమని ఆధార్ సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

ఒకరికి గాయాలు


బంట్వారం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన బంట్వారం శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాలు.. ధారూరు మండలం హరిదాస్‌పల్లికి చెందిన దోర్నాల రాంచందర్ (41) సోమవారం బంట్వారం నుంచి సల్బత్తాపూర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. బంట్వారం శివారులోని ఫంక్షన్ హాల్ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో జరిగిన ప్రమాదంలో రాంచందర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బాధితుడిని 108 అంబులెన్స్‌లో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'దోమ'లో దొంగల హల్‌చల్


- మూడురోజులుగా వరుస చోరీలు
- తాజాగా కట్టమైసమ్మ ఆలయంలో చోరీ

దోమ: దోమ మండలంలో చోరీల పరంపర కొనసాగుతోంది. తాళం వేసి ఉన్న దేవాలయాలు, ఇళ్లనే టార్గెట్ చేసుకుంటున్న దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. తాజాగా ఆదివారం మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలోని కట్టమైసమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ముందుగా ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి ఆలయ తాళాలను ధ్వంసం చేసి హుండీలో ఉన్న డబ్బును ఎత్తుకెళ్లారు. మరోపక్క బాస్‌పల్లి గ్రామంలో ఓ రైతు మేకను ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు. బొంపల్లిలో రెండు రోజుల క్రితం గౌసుద్దీన్ ఇంట్లో దొంగలు పడి బీరువాలో ఉన్న నగదు, రెండు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఆయా చోరీలకు సంబంధించి సోవారం పీఎస్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపిక



చరణ్



అఖిల

కుల్కచర్ల: అండర్–19 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు కుల్కచర్ల మండలం ఆదర్శ పాఠశాల విద్యార్థులు చరణ్, అఖిలశివసాయి ఎంపికయ్యారు. ఈనెల 23న నగరంలోని హయత్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–19 వాలీబాల్ పోటీల్లో భాగంగా వికారాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన చరణ్ మరియు అఖిల.. ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. సోమవారం ముజాహిద్‌పూర్‌లోని పాఠశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి ఘనంగా సన్మానించారు. పీఈటీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

దౌల్తాబాద్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలంలో పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. నందారంలో మన ఊరు–మన బడి పాఠశాల పునః ప్రారంభోత్సవం, కొడీడ్ నుంచి నందారం బీటీ రోడ్డు శంకుస్థాపన, మాటూరు గ్రామంలో మహిళా సమాఖ్య భవనం ప్రారంభోత్సవం, దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మత్స్య కార్మికులకు చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్, జెడ్పీటీసీ మహిపాల్, సర్పంచ్ మొహన్‌రెడ్డి, నాయకులు.. నరోత్తంతరెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులుఉన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కడ్తాల్: బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన కడ్తాల్– షాద్‌నగర్ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన జంగయ్య సోమవారం పని నిమిత్తం కడ్తాల్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మక్తమాధారంగేట్ సమీపంలోని పౌల్ట్రీ ఫామ్ వద్ద కుక్కలు అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో జంగయ్య కాలు విరగడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి..

వ్యక్తి మృతి

మర్పల్లి: బంధువుల వద్ద దావత్‌కు వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొత్లాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పైడిగుమ్మల గ్రామానికి చెందిన బాల్‌రాజ్ (45) కూలీపనులు చేసుకుంటూ జీవనం గడిపేవాడు. ఆదివారం బాల్‌రాజ్ మర్పల్లి మండల పరిధిలోని కొత్లాపూర్‌కి చెందిన బంధువుల వద్ద ఫంక్షన్ ఉండటంతో గ్రామానికి వచ్చాడు. అదేరోజు రాత్రి 10:30 గంటల సమయంలో బంధువులతో కలిసి భోజనం చేశాడు. బంధువుల ఇంటిపక్కనే ఉన్న చేదుడు బావి కట్టపై కూర్చుండబోయి ప్రమాదవశాత్తు బాల్‌రాజ్ బావిలో పడిపోయాడు. గమనించిన బంధువులు వెంటనే బావిలోకి దిగి పైకి తీసినప్పటికీ అప్పటికే బాల్‌రాజ్ మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.



బాల్‌రాజ్ మృతదేహం

కట్నం వేధింపులు తాళలేక..

వివాహిత బలవన్మరణం

మీర్‌పేట: అదనపు కట్నం వేధింపులు భరించలేక ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మీర్‌పేట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కిరణ్‌కుమార్ కథ నం ప్రకారం జిల్లెలగూడ కమల నెహ్రూ నగర్‌కు చెందిన శంకరయ్య కుమార్తె జింకల కవిత(23)కు గతే దాది ఏప్రిల్‌లో గుండేటి బాలరాజుతో వివాహమైంది. మూడు నెలలపాటు వీరు కాపురం సజావుగానే సాగింది. అనంతరం భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధింపులు మొదలు పెట్టారు. దీంతో ఐదు నెలల క్రితం సరూర్‌నగర్ మహిళా పీఎస్‌లో భర్త, అత్తమామలపై ఫిర్యాదు చేసి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ క్రమంలో విరక్తి చెందిన ఆమె ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

పెద్దేముల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్‌తో పాటు అందులో ఉన్న కరెంటు వస్తువులు చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రైతులు తెలిపిన వివరాలు.. పెద్దేముల్ మండలం మారేపల్లితండాకు చెందిన రాజు.. పొలంలో 25హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్(ప్రభుత్వం అందించిన)ను గతంలో ఏర్పాటు చేశారు. కాగా ఈనెల 23వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఆయిల్‌తో పాటు అందులో ఉన్న వస్తువులను ఎత్తుకెళ్లారు. సోమవారం తండాకు చెందిన రైతులు రాజు, భీసింగ్, భీంజి, ధర్మానాయక్, రైతులు ఈ విషయమై పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

డీసీపీ చింతమనేని శ్రీనివాస్

తుర్కయంజాల్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఏర్పాటే కీలకమని మహేశ్వరం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని గణేశ్ నగర్ ఫేజ్–2లో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు ఏడు కొండల్ యాదవ్, తగరం సత్యనారాయణ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం డీసీపీ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోయాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అన్ని కాలనీల ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల సీఐ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నాయకులు రొక్కం చంద్రశేఖర్ రెడ్డి, ఎస్.ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

అవయవదానం చేయండి

కుల్కచర్ల: అవయదానంతో మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని కుల్కచర్ల మండల వైద్యాధికారి మాధురి అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అవయదానం గూర్చి రోగులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాధురి మాట్లాడుతూ.. ఇబ్బందుల్లో ఉన్నవారికి అవయదానం చేయడం వల్ల మరొక కుటుంబానికి పరోక్షంగా అండగా నిలిచే అవకాశం ఉందన్నారు. ఏదైనా ప్రమాదంలో తమవారిని కోల్పోయిన కుటుంబ సభ్యులు ఆ మృతదేహం అవయాలను ఇతరులకు అందించేలా ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, సిరాజ్, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.



అవయదానంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యులు